క్లుప్తంగా

రైతు సంక్షేమానికి సీఎం జగన్ కృషి



పి.గన్నవరంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాన్ని చిట్టిబాబు సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ భారతి, సర్పంచ్ బొండాడ నాగమణి, పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, నాగాబత్తుల యువరాజు, పెచ్చెట్టి రాంబాబు, ఏఓ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

27న అమృత లింగేశ్వరునికి జలాభిషేకార్చన

మామిడికుదురు: పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువుదీరిన ఉమా అమృత లింగేశ్వరునికి ఈ నెల 27వ తేదీ బుధవారం 108 బిందెలతో జలాభిషేకార్చన, పంచామృత అభిషేకార్చన, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీశివ కేశవ భక్త బృందం సోమవారం తెలిపింది. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం శివుడు ఉద్భవించిన రోజు పురస్కరించుకుని ఈ పూజ ఏర్పాటు చేశామన్నారు. 2005 నుంచి ఈ ప్రత్యేక పూజలు చేపట్టామని చెప్పారు. ఇంత వరకు పద్దెనిమిదేళ్లు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. 19వ ఏడాదిలో 108 బిందెలతో జలాభిషేకార్చన ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆర్థికసాయం పంపిణీ



గంగారత్నంకు సాయం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: నియోజకవర్గంలోని లక్కవరంలో అంగవైకల్యంతో బాధపడుతున్న గుబ్బల భూపేష్‌కు, కేశవదాసుపాలెంలో కాళ్లు సక్రమంగా పనిచేయక ఇబ్బందులు పడుతున్న దేవ గంగారత్నంలకు రూ.5 వేలు చొప్పున జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ సోమవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కుమారుడు, ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆదేశం నుంచి మొత్తం రూ.10 వేలు పంపారు. ఈ మేరకు దీనిని ఆమె అందజేశారు. నాయకులు మంగెన సింహాద్రి, ముదునూరి విష్ణు మూర్తిరాజు, వి.లక్ష్మణరావు, సీహెచ్ సత్యనారాయణ, కొల్లాబత్తుల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరుని హుండీ ఆదాయం రూ.5.51 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.5,51,696 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. 130 రోజుల అనంతరం సోమవారం వివిధ దేవస్థానాల ఈవోలు ఎం.రాధాకృష్ణ, ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లు లెక్కించారు. శనైశ్చర స్వామి దేవస్థానానికి సంబంధించి హుండీల ద్వారా రూ.5,51,696, అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.16,500, ఈ ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.25,514 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడపా వెంకటేశ్వరరావు, దేవస్థానం ఎస్‌ఏ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన దీక్షలు

రాజోలు: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులు నిరసన దీక్షలు చేపట్టారు. సోమవారం దీక్షలను సీనియర్ న్యాయవాది పొన్నాడ సూర్యారావు ప్రారంభించారు. ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, జి.రజిత, ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు: అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సమ్మెకు మద్దతు తెలిపారు. నిరవధిక దీక్ష చేపట్టి ఏడు రోజులు కావస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. వారి సమ్మెను భగ్నం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

శరణు శరణు శరవణభవ..

- భక్తిశ్రద్ధలతో షష్ఠి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నాగేంద్రునికి పూలు, పడగల సమర్పణ



మానేపల్లిలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



పెదపల్లలో ఉభయ దేవేరులతో అలంకార భూషితుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



ఆత్రేయపురంలో ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కొత్తపేట: సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ గ్రామాన వేంచేసిన స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని కొబ్బరికాయలు, అరటి పండ్లతో పాటు పూలు, పడగలు సమర్పించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ప్రధానంగా మండలంలోని వాడపాలెం స్వయంభువు వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆల యానికి భక్తులు పోటెత్తారు. అలాగే కొత్తపేటలో స్వయంభువు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూలు, పడగలు సమర్పించారు. ఆయా ఆలయాల వద్ద స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పోలీసులతో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, యువకులు వలంటరీ సేవలు అందించారు. మండలంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలతో పాటు శివాలయాల్లో సుబ్రహ్మణ్యస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురం: సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలకు పురస్కరించుకుని మండలంలోని వాడవాడలా షష్ఠి వేడుకలు నిర్వహించారు. ఆత్రేయపురం వల్లీ, దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, వాడపల్లి సుబ్రహ్మణ్యస్వామి అలాగే పలు గ్రామాల్లోని సుబ్రహ్మణ్యుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆలమూరు: వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవాలను మండలంలోని వివిధ గ్రామాల్లోని భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు, శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. గౌతమీ గోదావరిలో పుణ్య స్నానమాచరించిన భక్తులు సమీప జొన్నాడలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో నెలకొల్పబడిన సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. మూలస్థాన అగ్రహారం, చింతలూరు, చెముడులంక, మడికి, చొప్పెల్ల తదితర గ్రామాల్లోని ఆలయాలను భక్తులు దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బి.దొడ్డవరంలో ఊరేగింపుగా పాల కావిళ్లు తీసుకు వస్తున్న భక్తులు



వాడపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి ఆలయం వెలుపల బారులు తీరిన భక్తులు



మాచవరంలో బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. బి.దొడ్డవరం బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాల కావిళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. శిరస్సున బిందెలతో పాలు పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవం పలువురు భక్తులు ఒక రోజు సుబ్రహ్మణ్య దీక్ష చేపట్టారు. సుబ్రహ్మణ్యస్వామికి ప్రీతికరమైన ఆవు పాలతో అభిషేకాలు చేయించారు. వెండితో చేయించిన పాము, పడగ స్వామికి కానుకగా సమర్పించారు.

మలికిపురం: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రామరాజులంక, పెదతిప్ప, బట్టేలంక, తూర్పుపాలెం, గుడిమెళ్లంక గ్రామాల్లోని స్వామి వారి ఆలయాలు ఉదయం నుంచీ భక్తులతో కిటకిటలాడాయి. పెద తిప్ప ఆలయంలో కొత్తపల్లి లింగేశ్వరరావు- శ్రీదేవి దంపతులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

రాజోలు: కడలి కపోతేశ్వరస్వామి వారి ఆలయంలో తెల్లవారుజాము నుంచి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. అర్చక స్వామి కాకాని వెంకట సత్యకృష్ణకుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జెడ్పీటీసీ మట్టా శైలజ తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్ప వాహనంపై స్వామిని కొలువుదీర్చి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

పి.గన్నవరం: మానేపల్లిలో వేంచేసిన సుబ్రహ్మణ్య స్వామిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, నాయకులు చిట్టూరి రవి, యన్నాబత్తుల నాగభూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే షష్ఠి పురస్కరించుకుని మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పి.గన్నవరం గరుడేశ్వరాలయంలో ఆలయ అర్చకులు పూజ్యం మార్తాండ నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

అంబాజీపేట: మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల షష్ఠి ఎంతో ఉత్సాహంగా కొనసాగింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గోకవరపు సత్యనారాయణమూర్తి, వారి కుమారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను సత్యసాయి సేవా సమితి సభ్యులు అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రావులపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊబలంక, రావులపాలెం, గోపాలపురం, తదితర గ్రామాల భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఊబలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద 19 అడుగుల కుమారస్వామి విగ్రహాన్ని గ్రామస్తులతో పాటు సమీపప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

జోడెడ్ల బండిపై దర్శనానికి..

అంబాజీపేట: సంస్కృతి సంప్రదాయాలకు గ్రామీణ ప్రాంతాలు చిరునామాలు అంటే అతిశయోక్తి కాదు. ఈ యాంత్రిక జీవనంలో పెళ్లిళ్లు, పేరంటాలు, విందులు, వినోదాలకు మోటారు సైకిళ్లు, కార్లలో రావటం జరుగుతోంది. అయితే ఇటీవల కాలంలో కొంతమంది సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో పచ్చి కొబ్బరి తడకలను కట్టిన జోడెడ్ల బండిపై రావడం ఆనవాయితీగా మారింది. దీనిలో భాగంగా సోమవారం మాచవరంలో జరిగిన సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థానికి బండారులంకకు చెందిన వాసంశెట్టి రాధాకృష్ణ కుటుంబ సభ్యులు కపిల పుంగనూరు కోడిగిత్తల జోడేడ్ల బండిపై కుటుంబమంతా స్వామి దర్శనానికి సంప్రదాయ బద్ధంగా తరలివచ్చారు. కోడె గిత్తల బండిపై తీర్థానికి వచ్చిన వారిని, బండిని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు.



షష్ఠి తీర్థానికి వెళుతున్న జోడెడ్ల బండి

ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లందరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని చెముడులంక, మడికి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, యు.లక్ష్మీ మౌనిక అధ్యక్షతన నిర్వహించిన ఈవీఎం అవగాహన సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఓటర్ స్లిప్ జారీ దగ్గర నుంచి ఈవీఎంలో ఓటు వేసే వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలను ఈసందర్భంగా రెవెన్యూ, బూత్ కమిటీ అధికారులు సమగ్రంగా వివరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఓటు హక్కు లేకపోయినా, తప్పులు దొర్లినా సత్వరమే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.జానకిరామయ్య, పంచాయతీ కార్యదర్శులు కె.మోక్షాంజలి, యు.రేణుక, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌లో మలికిపురం రోటరీ క్లబ్ ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న రొటేరియన్ శివకుమార్

మలికిపురం: రోటరీ డిస్ట్రిక్ట్ 3020 జోన్ ఫోర్త్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి 21 రోటరీ క్లబ్‌లకు జరిగిన ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్ టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్‌లకు పోటీలు నిర్వహించారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో మలికిపురం రోటరీ క్లబ్‌కు చెందిన నల్లి శివకుమార్ గెలుపొందగా, రన్నరప్‌గా మట్ట రవికుమార్ సరిపెట్టుకున్నారు. నర్సాపురంలో జరిగిన పోటీలలో విజేతలైన వారికి నర్సాపురం రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ చందక రాము, రోటరీ ప్రెసిడెట్ సత్యవతి, సభ్యులు బహుమతులు అందించారు.

ఆరోగ్యప్రదాయిని ఆరోగ్యశ్రీ

అంబాజీపేట: పేదల ఆరోగ్య ప్రదాయిని, సంజీవనిగా వెలుగొందుతున్న వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథక పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచుతూ సువర్ణ అధ్యాయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం నిర్వహించిన ఆరోగ్య సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌ను అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు ఆరోగ్య సిబ్బంది తిలకించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ 2024 జనవరి ఒకటో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారన్నారు. ప్రతి పేద కుటుంబం ఒక ఏడాది కాలంలో 25 లక్షల వరకు వైద్య సేవలు వరకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మట్టా పార్వతి, విత్తనాల దుర్గాభవాని, ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి, వైద్యాధికారులు వి.గౌతమి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు చారిత్రాత్మకం

ఆలమూరు: నిరుపేద, సామాన్య ప్రజానీకం వైద్య చికిత్స నిమిత్తం అప్పులు కాకూడనే ఉద్దేశంతో సీఎం జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకూ పెంపు చారిత్రాత్మకమని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆరోగ్యశ్రీకి సంబంధించి విధి విధానాలపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేసిన విషయాలపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య, హెచ్ఈ ఏవీవీ రాజా, హౌసింగ్ జేఈ దర్నాల శ్రీనివాసు పాల్గొన్నారు.

కళాశాల నూతన భవనాన్ని పునర్నిర్మించాలి

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకుని 15 ఏళ్లు దాటినా ఇప్పటి వరకూ కళాశాల అభివృద్ధికి నోచుకోలేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్ విమర్శించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ స్థానిక కళాశాలను నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేస్తామని ప్రకటించినా ఆ హామీ ఇప్పటి వరకూ నెరవేరకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జూనియర్ కళాశాల సరిహద్దులను సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాగంలో తాచుపాము హల్‌చల్

అయినవిల్లి: మండలంలోని మాగం నక్కా శ్రావణి నివాసంలో సోమవారం తాచుపాము హల్‌చల్ చేసింది. దీంతో శ్రావణి కుటుంబ సభ్యులు భయకంపితులై ఇంటి నుంచి పరుగులు పెట్టారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పామును బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలి పెట్టారు.

తుపాను బాధితులకు ఐఆర్ఎస్ సాయం



ఉయ్యూరువారి మెరకలో బాధితులరాలికి టార్పాలిన్ ఇస్తున్న బుజ్జిరాజు

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో ఇటీవల వచ్చిన తుపాను కారణంగా దెబ్బతిన్న 15 తాటాకిళ్లకు సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సాయం పంపిణీ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో ఈ సాయం రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు, మెంబర్ అల్లూరి మధురాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ మేరకు ఉయ్యూరువారి మెరక, మలికిపురం, లక్కవరం, బట్టేలంక గ్రామాల్లో బాధితులకు ఈ టార్పాలిన్లు, హైజీన్ కిట్స్ అందజేశారు. ఐఆర్ఎస్ మెంబర్లు బోణం రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు, తాడి సహదేవ్, రత్నప్రసాద్, ఏసుబాబు, మూర్తి, స్వామి పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్‌కు నోటీసులు

మలికిపురం: స్థానిక వెంకట నారాయణ థియేటర్ రోడ్డులోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ బ్రాంచ్ నిర్వాహకుడు ఆకన రత్తయ్యకు నోటీసులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ సోమవారం తెలిపారు. ఇక్కడ ఇరుకురోడ్డుతో పాటు చాలాకాలం క్రితం వేసిన తక్కువ ఎత్తులో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ భారీ వాహనాలను తన షెడ్డు వద్ద నిలిపి లోడింగ్ చేస్తున్నారని, దీంతో ఇక్కడ ప్రమాదాలు జరిగిన ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. ఇక్కడ లాంగ్ విద్యుత్ స్తంభాలు వేసుకునేందుకు ట్రాన్స్‌పోర్టు యజమాని నగదు చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. వెంటనే నగదు చెల్లించి స్తంభాలు మార్పించుకోవాలని నోటీసు జారీ చేసినట్లు సూచించారు. అలాగే మలికిపురం, లక్కవరం వర్తక కూడళ్లలో వ్యాపారస్తులు విద్యుత్ స్తంభాలకు తగిలేలా వాహనాలను నిలిపితే చర్యలు తీసుకుంటామని ఏఈ పేర్కొన్నారు.

డిజిటల్ బోర్డు ఆవిష్కరణ



పి.గన్నవరంలో అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో సోమవారం పి.గన్నవరం-1 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ ఈసందర్భంగా అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ఇంతవరకూ రూ.24 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆయన వివరించారు. నాయకులు దాసరి కాశీ, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, ఎస్.యువరాజు, పి.రాంబాబు, ఎస్.రాజేంద్రప్రసాద్, కుడుపూడి రాము, బోడపాటి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కొత్తపేట: రాష్ట ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కొత్తపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం

- లొల్లలో గడప గడపకూ..
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



లొల్లలో గడపగడపకూ కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఒకప్పుడు మాకేదైనా పథకం కావాలంటే ఎంతో మంది చుట్టూ తిరిగి తిరిగి విసుగు పుట్టేది.. ఇప్పుడైతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా వలంటీర్ల ద్వారా మా ఖాతాలకు పథకాల సొమ్మును నేరుగా జమ చేస్తున్నారు. మీరు కూడా ఎలాంటి పక్షపాతం లేకుండా సాయం చేస్తున్నారు. మళ్లీ మిమ్మల్ని, సీఎం జగన్‌ను గెలిపించుకుంటామని లొల్ల గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి తెలిపారు. తొలుత ఆయనకు ఆ గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మండలంలోని లొల్లలో సోమవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తూము రాంబాబు, తూము తాతాజీ, దాట్ల సూర్యనారాయణరాజు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారులకు గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ సకాలంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా డైరెక్ట్‌గా తమ ఖాతాలకే జమవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వద్ద హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, వైస్ ఎంపీపీ పెనుమత్స బంగార్రాజు, ఎంపీడీఓ నాతిబుజ్జి, సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారుల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ సాహితీ ఉత్సవాలకు పలు రికార్డులు



తాడేపల్లిగూడెంలో ప్రతాప్‌ను ఆత్మీయ జ్ఞాపికతో అభినందిస్తున్న కొమ్మినేని

సఖినేటిపల్లి: తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో గత రెండు రోజులుగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 30 గంటల పాటు నాన్‌స్టాప్‌గా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు పలు ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నాయి. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో 1500 మంది కవులు, కళాకారులతో 17, 18 తేదీల్లో నాన్‌స్టాప్‌గా నిర్వహించిన నిర్విరామ ఈ ఉత్సవాలను ధ్రువీకరిస్తూ ఆయా సంస్థలు రికార్డులు నమోదు చేశాయి. ఈ మేరకు భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు అసోసియేషన్ బుక్ ఆఫ్ రికార్డ్, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో కళా ఉత్సవాల నిర్వహణ రికార్డులు నమోదయ్యాయి. సోమవారం వివరాలను ప్రతాప్ మీడియాకు తెలిపారు. ప్రతాప్ పర్యవేక్షణలో స్థానిక కళావేదిక ఏర్పాటు చేసిన సాహిత్య సాంస్కృతిక ర్యాలీని ముఖ్యఅతిథి హోంమంత్రి తానేటి వనిత జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్య అతిథి, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరై ప్రతాప్‌ను స్థానిక కళావేదిక టీం సిద్ధం చేసిన ఆత్మీయ జ్ఞాపికను బహూకరించారు. కవులను, కళాకారులను ఒక చోటకు చేర్చిన ప్రతాప్‌ను అభినందించారు.